


నేడు గోనూర్‌లో రెవెన్యూ సదస్సులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూర్, వీర్‌శెట్టిపల్లి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. గోనూర్‌లో డిప్యూటీ తహశీల్దార్ లలిత పాల్గొంటారని తెలిపారు.

భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం


కుల్కచర్ల: ఇప్పాయిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి


దోమ: ఊటుపల్లి గ్రామంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర

కుల్కచర్ల: భూభారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇప్పాయిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. కాబట్టి అందులోని లోపాలను సవరించి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. రైతాంగ అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి: ఆర్డీఓ వాసుచంద్ర

దోమ: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని ఆర్డీఓ వాసుచంద్ర అన్నారు. ఊటుపల్లి, గంజిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ మాతను తీసుకొచ్చారని, ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 58 దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు ఉండాలి

యాలాల ఎస్‌ఐ గిరి

యాలాల: వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పకుండా ఉండాలని యాలాల ఎస్‌ఐ గిరి పేర్కొన్నారు. మంగళవారం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.





కొనసాగుతున్న కొత్లాపూర్ జాతర


ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలో కొత్లాపూర్ గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ జాతర కొనసాగుతుంది. మంగళవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్య క్రమంలో ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్, మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ సర్పంచు సాయిలు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం

తాండూరు టౌన్: ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ కుమార్ అన్నారు. మంగళవారం బీజేపీ నాయకులు రేషన్ షాపులను సందర్శించి రేషన్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఒకేసారి మూడు నెలలకు సంబంధించి రేషన్‌ను పంపిణీ చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశించారన్నారు. కరోనా కష్టకాలంలో సైతం కేంద్రం అండగా నిలిచిందని గుర్తు చేశారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, మల్లేష్ యాదవ్, పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. 2006–2007బ్యాచ్ విద్యార్థులు వేదిక ఏర్పాటు చేసుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి వారితో మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకొని కుంటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు.



ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు

వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవి


బంట్వారం: మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజేష్‌రెడ్డి

మోమిన్‌పేట: ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయడమే లక్ష్యమని వ్యవసాయ శాస్త్ర వేత్త పల్లవి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డితో కలిసి విత్తనాలు పంపిణీ చేశారు. ప్రతీ రైతు విత్తన ఉత్పత్తి స్వయం సమృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు

బంట్వారం: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించొచ్చని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజేష్‌రెడ్డి పేర్కొన్నారు. బంట్వారం రైతు వేదికలో కంది, జొన్న విత్తనాలను పలువురు రైతులకు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రావ్య, ఏఈఓలు మశ్చందర్, శిరీష రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

కుల్కచర్ల: రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో వరి, కంది, జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి వీరస్వామి, వెంకటయ్య, పాల్గొన్నారు.

దుద్యాల్‌లో 36మందికి పంపిణీ

దుద్యాల్: దుద్యాల్ రైతు వేదికలో మండల వ్యాప్తంగా 36మందికి వరి, కంది విత్తనాలను కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, వ్యవసాయ అధికారి నాగరాజ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రేణుక, భావన, జ్యోతి, మాణికేశ్వరి, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, మాజీ సర్పంచ్ ఖాజా, రైతులు కృష్ణ, శ్రీకాంత్, వెంకటేశ్, జైపాల్ పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

పూడూరు: రైతులు నాణ్యమైన విత్తనాలు విత్తుకుని అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ శాస్త్రవేత్త సుప్రియ తెలిపారు. పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో వరి, కంది విత్తనాలను అందజేశారు. పరిగి డివిజన్ వ్యవసాయ అధికారి లక్ష్మికుమారి, మండల వ్యవసాయ అధికారి తులసిరాం, రైతులు తదితరులు పాల్గొన్నారు.



